# అమ్మముద్దు

సరిగ్గా ఇరవై ఏళ్ళ క్రితం!

అప్పుడు నా వయసు నలభై ఏళ్లు... వరంగల్లులోని ఓ ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగం చేస్తుండే వాణ్ణి. అప్పట్లో, మా ఆఫీసుకి దగ్గర్లో కొంత స్థలం అమ్మకానికి వస్తే కొనేసి ఆర్నెల్ల వ్యవధిలో ఇల్లు కట్టించేశాను. గుళ్లో పూజారి గారి చేత ముహూర్తం పెట్టించుకుని గృహప్రవేశం చేశాను.

ముహూర్తానికి వారం రోజుల ముందే మా ఊర్నించి అమ్మా, నాన్నా వచ్చారు. వాస్తురీత్యా ఇల్లు బాగుందన్నారు... ముఖ్యంగా హాల్లో పరిచిన 'మొజాయిక్' ఫ్లోరింగూ, వంటగదిలోనూ, డైనింగు హాల్లోనూ ఏర్పాటు చేసిన 'వాష్ బేసిన్లూ' బాత్రూంలో వేణ్ణీళ్లు వచ్చేందుకు గీజరూ, అన్నీ అమ్మకు ఎంతో నచ్చాయి.

గృహప్రవేశం జరిగిన అయిదో రోజు...!

నాకు - ఇప్పటికీ మరీ మరీ జ్ఞాపకం వచ్చే రోజు... ఆగస్టు, ఎనిమిది...! ఆఫీసుకి వెళ్లే హడావిడిలో గబగబా స్నానం చేసి 'బాత్రూం' లోంచి బయటకు వచ్చాను. గీజరులో నీళ్లు ఇంకా వేడిగా ఉండటం వల్ల అమ్మని కూడా త్వరగా స్నానం చేయమన్నాను... అమ్మ తన బట్టలు తీసుకుని స్నానాలగది వైపు నడిచింది... అంతకు ముందు నేను స్నానం చేసినప్పుడు కొన్ని నీళ్లు, తలుపు కింద నించి బయటకు రావటం వల్ల నున్నగా వున్న, ఆ తడినేలమీద అమ్మ చూసుకోకుండా, కాలు వేసేసరికి జర్రున జారి, వెనక్కి వెల్లకిలా పడిపోయింది... నేను వెంటనే వెళ్లి లేవదీశాను.

"అయ్యో! నేను స్నానం చేసినప్పుడు నీళ్లు బయటకు వచ్చేశాయి కాబోలు... చూసుకోలేదు... దెబ్బ తగిలిందా?" అడిగాను ఆందోళనగా.

"ఫరవాలేదు లేరా!" అంది అమ్మ, తలవెనుక భాగాన్ని తన అరచేత్తో గట్టిగా అదిమి పట్టుకుని... ఆ చేతి వేళ్ళ మధ్య నించి రక్తం ధారాపాతంగా కారిపోవటం గమనించాను... తలకు పెద్ద గాయమే అయింది.... నాకు భయం వేసింది. అక్కడే ఉన్న టవలు తెచ్చి, నీళ్లలో తడిపి - గబగబా తలకు కట్టుకట్టి - క్షణం ఆలస్యం చేయకుండా రిక్షా పిలిచి, ఆస్పత్రికి తీసుకెళ్లాను...

ఆస్పత్రిలో అమ్మ పరిస్థితిని చూసిన డాక్టరు - అర్జంటుగా రక్తం ఎక్కించాలని

చెప్పాడు... అమ్మ గ్రూపు రక్తం ఆస్పత్రిలో లేకపోయింది. నాదీ, నాన్నగారిదీ కూడా అమ్మ రక్తానికి సరిపోలేదు.

"త్వరగా రక్తం తెచ్చుకునే ఏర్పాటు చేసుకోండి... లేకపోతే ఆవిడ ప్రాణానికే ప్రమాదం!" అంటూ హెచ్చరించి, డాక్టరు వార్డు వైపు వెళ్లిపోయాడు.

ఆస్పత్రిలోనే ఉన్న ఫోను తీసుకుని - నేను, మా ఆఫీసు మిత్రులకు విషయం చెప్పాను.. వాళ్లు రాగానే, చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉన్న ఏ 'బ్లడ్ బ్యాంకు' నుంచైనా - ఎంత ఖరీదైనాసరే - అమ్మ 'గ్రూపు' రక్తాన్ని కొనుక్కురమ్మని పంపించాను...

నేనూ, నాన్నగారూ అమ్మ పక్కనే కూర్చుండిపోయాం... గాయానికి 'సూచర్స్' వేసినా రక్తం బాగా ప్రవిస్తూనే ఉంది...! నిమిషాలూ... గంటలూ... గడిచిపోతున్నాయి. రక్తం కోసం వెళ్లిన మిత్రుల జాడ కనిపించలేదు... అమ్మ పరిస్థితి క్రమేపీ దిగజారిపోతోంది... నాన్నగారు నిస్సహాయంగా చూస్తున్నారు.

"నా అజాగ్రత్తవల్లనే ఈ ఘోరం జరిగింది. స్నానం చెయ్యమని నిన్ను తొందర పెట్టకపోయినా బావుండేది!" అమ్మతో అన్నాను దిగులుగా.

"ఇందులో నీ అజాగ్రత్త ఏముందిరా?... నా గ్రహచారం అలావుంది... అయినా మనిషన్నాక - ఇలాంటి ఎన్నో రకాల దెబ్బలు తగుల్తూనే ఉంటాయి. ఓర్చుకోవాలి!" తను ఓర్చుకునే ప్రయత్నం చేస్తూనే - నన్ను ఓదార్చింది!... ఎంతైనా అమ్మ కదా!...

మందుల్ని తయారు చేసేవాళ్లు - వాటి 'ఎక్స్‌పైరీ' తేదీల్ని ఆ సీసాల లేబుళ్ళ మీద ముద్రించినట్లుగా - ఓ మనిషిని పుట్టించిన బ్రహ్మదేవుడు కూడా - ఆ మనిషి 'ఎక్స్‌పైరీ' తేదీని - అతని నుదిటి మీద రాసేస్తాడు... ఎటొచ్చీ సీసా మీద తేదీ కనిపిస్తుంది. నుదుటి మీద తేదీ మాత్రం కనిపించదు!

అలా కనిపించకపోవటం వల్లనే - అమ్మకి కేవలం ప్రమాదవశాన ఆ గాయం తగిలిందనుకున్నానే తప్ప - అది ప్రాణహానికి దారి తీస్తుందని గ్రహించలేక పోయాను. అమ్మకి - ఆ బ్రహ్మ లిఖించిన 'ఎక్స్‌పైరీ' తేదీ అదేనని ఊహించలేకపోయాను. అందుకే రక్తం కోసం వెళ్లిన మిత్రులు వట్టి చేతుల్తో వచ్చారు. డాక్టరు అప్పటికి ఏదో ప్రాథమిక చికిత్స చేసి - తన చేతుల్లో ఇక ఏమీ లేదన్నాడు... ఆ సాయంత్రం సూర్యాస్తమయ సమయానికి ముందే - అమ్మ అస్తమించింది... అందుకు పూర్తిగా నేనే కారణమన్న భావన నాలో బలపడిపోయింది!

నేను కట్టించిన ఇల్లు - వాస్తురీత్యా మంచిది కాదని కొందరన్నారు... ఆ 'కొత్త ఇల్లు' అమ్మ ప్రాణాల్ని బలి తీసుకుందని ఇంకొందరు అనుకున్నారు... ఆ సంఘటన

జరిగిన ఏడాదిలోపే, ఇల్లు అమ్మేసి, నేను హైదరాబాదుకి 'ట్రాన్స్‌ఫర్' చేయించుకుని వచ్చేశాను...

★ ★ ★

సరిగ్గా అయిదేళ్ళ క్రితం...!

అప్పుడు నా వయస్సు ఏభై అయిదేళ్లు... సాయంత్రం ఆఫీసు నించి రాగానే బట్టలు మార్చుకుని, హాల్లో ఉన్న సోఫాలో కర్చుని శ్యామల ఇచ్చిన కాఫీ తాగుతూ, టీవీ చూస్తున్నాను... అంతలో, టీవీ తెర - కిందభాగంలో, ఓ ప్రకటన 'స్క్రోల్' అవుతూ కనిపించింది...

'నిజాం ఆస్పత్రిలో - ప్రాణాపాయ స్థితిలో వున్న ఓ పేషెంటుకి - 'ఓ నెగటివ్' గ్రూపు రక్తం కావాలనీ. ఆ గ్రూపు రక్తం కలిగిన దాతలు వెంటనే తమను సంప్రదించాలనీ'. ఆ ప్రకటన సారాంశం!... దానితో పాటే 'స్క్రోల్' అవుతున్న సెల్‌ఫోను నంబర్ని 'నోట్' చేసుకున్నాను.

చాలాకాలం నేను 'రక్తదానం' గురించి పట్టించుకున్న వాణ్ణి కాదు... అయితే, రక్తం సమయానికి అందక, మా అమ్మ చనిపోయిన మరు సంవత్సరం నించీ - ఇప్పటి దాకా అదే రోజున తప్పనిసరిగా రక్తదానం చేస్తున్నాను... పైగా నాది అరుదైన గ్రూపు రక్తమని కూడా నాకు తెలుసు. అందుకే, అలా రక్తదానం చేయటంవల్ల నాకు మనశ్శాంతీ, నా కారణంగా చనిపోయిన అమ్మకి ఆత్మశాంతీ కలుగుతాయని నా నమ్మకం!

కాఫీ తాగిన వెంటనే బట్టలు వేసుకున్నాను... నేను 'నోట్' చేసుకున్న నంబరుకి ఫోను చేశాను.

"హలో! కరుణాకర్ హియర్!" అవతలి గొంతు వినిపించింది... నన్ను నేను ముందుగా పరిచయం చేసుకుని, నాది 'ఓ నెగిటివ్' రక్తమేననీ, వెంటనే వస్తున్నాననీ ఆయనకు చెప్పాను...

"థాంక్యూ సార్!... మీరు అర్జంటుగా రావాలి. కారు పంపించమంటారా?" ఆ కంఠంలో ఆందోళనా, ఆతృతా ధ్వనించాయి...

"అవసరం లేదండీ!... నేను హాస్పిటల్‌కి దగ్గర్లోనే ఉన్నాను... పది నిమిషాల్లో మీ దగ్గరుంటా!" చెప్పాను.

"వెరీగుడ్! తిన్నగా ఆపరేషన్‌థియేటర్ దగ్గరకు వచ్చేయండి... నేను అక్కడే మీకోసం వెయిట్ చేస్తుంటాను!" చెప్పాడు ఆయన.

నేను హాస్పిటల్‌కి చేరుకుని, లోపలకు వెళ్లేసరికి, ఆపరేషన్‌థియేటర్ ముందు

గోళ్లు కొరుక్కుంటూ దిగులు నిండిన కళ్ళతో దిక్కులు చూస్తూ అసహనంగా పచార్లు చేస్తున్న ఓ ముప్పయేళ్ళ యువకుడు కనిపించాడు... 'బహుశా అతనే నేమో' అనుకుంటూ దగ్గరకు వెళ్లాను... నన్ను చూడగానే ఖంగారుగా ఎదురొచ్చాడు...

"ఇంతకు ముందు ఫోన్లో మాట్లాడింది మీరేనా?" అడిగాడు, అదే ఖంగారుతో...

"ఔ"నని చెప్పీ చెప్పగానే నా చేయి పట్టుకుని క్షణంలో నన్ను డాక్టరు దగ్గరకు తీసుకెళ్లాడు... కేవలం ఓ అరగంట వ్యవధిలో నా రక్తం పరీక్షించి, పేషంటుకి ఎక్కించటం జరిగిపోయింది. తర్వాత, ఆ యువకుడు నాకు 'యాపిల్ జ్యూస్' తెచ్చి ఇచ్చాడు. అంతలో డాక్టరు మా దగ్గరకు వచ్చాడు...

"గండం గడిచిపోయింది! సమయానికి మీరు ప్రకటన చూడటం, వెంటనే దేవుడులాగా ప్రత్యక్షమై రక్తం ఇవ్వటం చాలా గొప్ప విషయం...! అందరూ మీలాగే రెస్పాండ్" అయితే ఎంతోమంది రోగుల్ని ప్రాణాపాయం నించి కాపాడిన వారమవుతాం" అన్నాడు అభినందన పూర్వకంగా నాకు 'షేక్‌హ్యాండ్' ఇస్తూ.

నేను బయటకు నడుస్తూంటే, కరుణాకర్ కూడా నాతో వచ్చాడు. మాటల సందర్భంలో, తాను 'రియల్ ఎస్టేట్' వ్యాపారం చేస్తూంటానని చెప్పాడు...

'ఇంతకీ 'పేషెంటు'ని నేను చూడలేదు... మీ నాన్నగారా?... లేక...?" సందేహిస్తూ అడిగాను.

"కాదండీ!... నా బంగారు తల్లి!... లేకలేక పుట్టిన ఒక్కగానొక్క కూతురు!... ఎల్.కే.జీ. చదువుతోంది... రోజూ మా పనికుర్రాడు, స్కూటరు మీద కూర్చోబెట్టుకుని, కాన్వెంటుకి తీసుకెడతాడు... ఇవాళ పొద్దున్న కూడా, అలాగే వెడుతూంటే, వెనకనించి ఓ నీళ్ళ లారీ వచ్చి, స్కూటర్ని 'ఢీ' కొట్టింది... మా బేబీ కిందపడిపోయింది... 'హెడ్ ఇంజురీ' అయింది. రక్తం చాలా పోయింది...!" చెప్పాడతను.

సరిగ్గా పదిహేనేళ్ల క్రితం, ఇలాగే 'హెడ్‌ఇంజురీ' తో ఆస్పత్రిలో చేరి కావాల్సిన గ్రూపు రక్తం దొరక్క, నిస్సహాయంగా కళ్లుమూసిన మా అమ్మ జ్ఞాపకానికి వచ్చింది... మనసంతా మళ్లీ దిగులుతో నిండిపోయింది... మరమనిషిలా నడుస్తూ, నా స్కూటరు దగ్గరకు చేరుకున్నాను.

"నాదో చిన్న 'రిక్వెస్టు' సార్!"... నేను స్కూటరు 'స్టార్ట్' చేస్తూంటే, నా చేయి పట్టుకుని అన్నాడు కరుణాకర్...

అతని వైపు ప్రశ్నార్థకంగా చూశాను. తన జేబులోంచి అతను ఓ నోట్ల కట్ట బయటకు తీశాడు... అవన్నీ వెయ్యి రూపాయల నోట్లు!

"నా బిడ్డ ప్రాణానికో, మీరు చేసిన సాయానికో విలువకట్టి ఇవ్వటం లేదు... కృతజ్ఞత కొద్దీ ఇస్తున్నాను... తీసుకోవాలి!... ప్లీజ్!" నాకు ఇవ్వబోయాడు.

"నో... నో! నేను మీ నుంచి కృతజ్ఞతలు ఆశించి, రక్తదానం చెయ్యలేదు... ఒకప్పుడు మా అమ్మ కూడా ఇలాగే, 'హెడ్ ఇంజురీ' తో ఆస్పత్రిలో చేరినప్పుడు, రక్తం దొరకలేదు... నా కళ్ళముందే ఆవిడ కన్ను మూసింది... అప్పట్నించీ, ఆమె ఆత్మశాంతి కోసం, ప్రతి ఏడూ, నేను రక్తదానం చేస్తూనే ఉన్నాను... రక్తం దొరక్క ఎవరూ చనిపోకూడదనుకునే వారిలో, నేను ఒకణ్ణి!... ఆ సంతృప్తి కోసమే ఇచ్చాను... అంతే!" అంటూ స్కూటర్ స్టార్ట్ చేశాను...

★ ★ ★

'ఎగ్జిబిషన్' ఆఖరి రోజులు కావటంతో మైదానమంతా జనంతో ఒకటే సందడిగా ఉంది. అంతమంది జనంలోకి వెళ్ళటం నాకు చిరాకే అయినా నా మనవడి పోరు పడలేక వచ్చాను... వాడికి ఇష్టమైన రంగులరాట్నం ఎక్కించి, క్రికెట్ బ్యాట్టూ, బంతీ కొనిచ్చి. తిరిగి బయటకు వస్తూండగా, నన్నెవరో పిలిచినట్లనిపించి వెనక్కి తిరిగి చూశాను... కొంచెం దూరంలో, ఓ షాపు దగ్గర కాఫీ తాగుతూ నిలబడిన వ్యక్తి. నా వైపు చిరునవ్వుతో చూస్తూ దగ్గరకొచ్చాడు...

"బావున్నారా?" అడిగాడు.

ఆయన్ని ఎక్కడో చూసినట్టే అనిపించింది... ఎక్కడ చూశానో వెంటనే గుర్తుకి రాలేదు... ఆయన వైపు అలాగే చూస్తూంటే... ఆయన అన్నాడు. "అదేమిటి సార్, అలా చూస్తారూ?... మర్చిపోయారా?... నేను "రియల్ ఎస్టేట్" కరుణాకరాన్ని!"

ఆ పేరు వినగానే గుర్తుకొచ్చాడాయన.

"ఓ... సారీ సార్!... మర్చిపోయాను!" నొచ్చుకుంటూ చెప్పాను.

"ఫరవాలేదులెండి... పెద్దవారు... ఈ మాత్రం దానికి సారీ చెప్పాలా?... అయినా మనం కలసి అయిదేళ్లు దాటిపోయిందిగా!... నేను మాత్రం మిమ్మల్ని మరచిపోలేదు... మరచిపోలేను కూడా... మా బేబీకి పునర్జన్మను ప్రసాదించిన దేవుడు మీరు. రోజూ మిమ్మల్ని తల్చుకుంటూనే ఉంటాం... అప్పుడప్పుడు మా బేబీ కూడా మిమ్మల్ని చూపించమని అడుగుతూంటుంది!" అంటూనే, పక్కనున్న బట్టల షాపులోకి వెళ్లి, తన భార్యనీ, కూతుర్నీ తీసుకొచ్చాడు... నన్ను వాళ్ళకు పరిచయం చేశాడు...

"ఆనాడు మీరే రాకపోతే, మా బిడ్డ మాకు దక్కకుండా పోయేది... కనీసం కొంతైనా రుణం తీర్చుకునే అవకాశం మీరు, మా వారికివ్వలేదట" కృతజ్ఞత నిండిన కళ్లతో చూస్తూ చెప్పింది కరుణాకర్ భార్య.

"ఆయువంటూ ఉండాలేగానీ, గాయాలెన్నైనా మనల్నేం చేయవమ్మా!... ఆ రోజు నేను కాకపోతే ఇంకొకరొచ్చి, రక్తం ఇచ్చేవారు!" అంటూ ఆమె పక్కనే ఉన్న ఎనిమిదేళ్ళ పాపను చూశాను... బాలకృష్ణుడికి ఆడపిల్ల వేషం వేసినట్టుగా ఎంతో ముద్దుగా కనిపించింది... ముద్దు పెట్టుకోవాలని కూడా అనిపించింది.

"మీ గురించి మా డాడీ రోజూ చెప్తూంటారంకుల్? మీరు మనుషుల్లో దేవుడట... అచ్చం అలాగే ఉన్నారు!" పాప చెప్తూంటే, ముత్యాలొలికినట్టే ఉంది...

"ఉంటే ఉన్నాను గానీ, నన్ను మాత్రం అలా 'అంకుల్' అని పిలవద్దు... 'తాతా' అని పిలవాలి. నాకు ఇద్దరు మనవళ్లున్నారు... ఇప్పుడు నువ్వేమో మనుమరాలివి!" ప్రేమగా బుగ్గ గిల్లుతూ చెప్పాను...

"అయితే నాకు ముగ్గురు తాతలన్న మాట!.... ఒకరేమో, డాడీ ఇచ్చిన తాతగారు. ఇంకొకరేమో మమ్మీ ఇచ్చిన తాతగారు... మీరేమో, ఆ దేవుడిచ్చిన తాతగారు,!.... మరి... మిమ్మల్ని ముద్దు పెట్టుకోవచ్చా?" నా చేయి పట్టుకుని, తల పైకెత్తి చూస్తూ అడిగింది బేబీ...

నేను ఇబ్బందిగా చూశాను...

"పెట్టుకోవచ్చుగానీ... నా గడ్డం నీకు గుచ్చుకుంటుందే?" గడ్డాన్ని చేత్తో రాసుకుంటూ చెప్పాను...

"ఫరవాలేదు... మా ఇద్దరు తాతల గడ్డాలు కూడా గుచ్చుకుంటాయి... పైగా వాళ్లెప్పుడూ నాకు 'చాక్లేట్లే' ఇస్తారు... కానీ మీరేమో, నాకు ప్రాణమే ఇచ్చారు కదా!" అంటూనే, నా మెడ చుట్టూ తన రెండు చేతులూ బిగించి, తల పైకెత్తి, నుదుటి మీద ముద్దు పెట్టుకుంది!

ఆ ముద్దు నాలో చెప్పలేని పరవశాన్ని కలిగించింది ఆ క్షణాన... ఎప్పుడో చిన్నప్పుడు, నా పుట్టినరోజు నాడు, మా అమ్మ నాకు తలంటు పోసి, కొత్త బట్టలు తొడిగి, హారతి కళ్ళకద్ది, బుగ్గ మీద పెట్టుకున్న ముద్దులా అన్పించింది.

"నీ పేరేమిటో ఈ తాతకి చెప్పవా మరి?" నేను కూడా తన నుదుటి మీద ముద్దు పెట్టుకుని అడిగాను.

"సుభద్ర" చెప్పింది...

నేను ఉలిక్కి పడ్డాను... 'సుభద్రా?' అస్పష్టంగా అడిగాను...

"అంటే అసలు పేరు లక్ష్మి సుభద్ర... అమ్మా, నాన్న, అందరూ సుభద్రా అనిపిలుస్తారు!"

నా శరీరమంతా, పులకించిందో, జలదరించిందో, లేక గగుర్పాటే కలిగిందో తెలియదు కానీ, నా కళ్ళల్లోకి అప్రయత్నంగా నీళ్లు పొంగి వచ్చాయి...

మా అమ్మ పేరు కూడా 'లక్ష్మి సుభద్రే... నాన్నగారు మాత్రం 'సుభద్రా' అని పిలిచేవారు.

వాళ్ళ దగ్గర శలవు తీసుకుని ఇంటికొచ్చేశాను... ఆ రాత్రి మొదటి సారిగా మా అమ్మ నాకలలో కనిపించింది!!

నది, మాసపత్రిక,

మే - *2011*

★ ★ ★